# అత్తగారు — అల్లుడుగారు

అత్తగారు అనగానే సూర్యకాంతం, భానుమతి రామకృష్ణ కథలు గుర్తుకు వస్తాయి. కొన్ని కొన్ని అత్తగారి జోకులు కూడా గుర్తొస్తాయి. 'ఇద్దరు పెళ్ళాలున్న వారికి పడే శిక్ష ఏమిటి?' అన్న ప్రశ్నకి సమాధానం 'ఇద్దరు అత్తగార్లు' లేదా 'మా మామగారు మరణిస్తున్నప్పుడు ఏం మాట్లాడలేదు. చివరిక్షణం దాకా మా అత్తగారు ఆయన పక్కనే ఉన్నారు' లేదా 'మా అత్తగారు ఎంతో మంచిది' అంటే ఇంకోడు చిన్నగా నిటూర్చి 'అదృష్టవంతుడివి, మా అత్తగారు బ్రతికే వుంది' అనడం....

నిజానికి ఈ జోకులన్నీ విదేశాలనించి దిగుమతి అయినవే. మన దేశంలో అత్తగార్లు ఎంతో సాధువులు. పండగలకి వచ్చినప్పుడు అల్లుళ్ళకి ప్రత్యేకంగా భక్ష్యాలు చేసిపెడుతూంటారు. అల్లుడి ముందుకు రావడానికి సిగ్గుపడటం కూడా కద్దు. అల్లుడు కూడా అత్తగారిని ఎంతో మర్యాదగా చూస్తాడు.

కాని విదేశాల్లో, ముఖ్యంగా బ్రిటన్‌లో అత్తగార్ల తీరేవేరు. కూతురితో పాటు అల్లుడింటికి వచ్చి అల్లుడి భరతం పడుతుంది. భార్యాభర్తల కీచులాటలో తలదూర్చి తన కూతురిదే రైటంటుంది. దాంతో మనదేశంలో అత్తా కోడళ్ళకి పడనట్లు బ్రిటన్‌లో అత్త అల్లుళ్ళకి పడదు. ఈ ఉప్పు—నిప్పు ఆధారంగా అత్తగారి జోకులు చాలా ప్రచారంలో వున్నాయక్కడ.

సాధారణంగా అలాంటి అత్తగారి జోకుల్లో అత్తగారు ఎంతో లావుగా వుంటుంది. అసహ్యంగా వుంటుంది. సూర్యకాంతంలా గయ్యాళి. ఎప్పుడూ ఏదో మాట్లాడుతూనే ఉంటుంది. అల్లుడికి అత్తగారంటే భయం అన్న అంశం కూడా కనబడుతుంది.

ఇక్కడ కోపం వస్తే 'వెళ్ళి మీ బాబుతో చెప్పుకో' అంటాం. కాని బ్రిటన్‌లో 'వెళ్ళి మీ అత్తగారితో చెప్పుకో' అంటారు. ఇది బూతు

తిట్టుకన్నా అవమానకరంగా భావిస్తారు బ్రిటిషర్స్.

వాళ్ళ మదర్స్-ఇన్-లా జోక్స్ ఎలా వుంటాయంటే....

ఓ భార్య తప్పిపోయిన తన భర్త గురించి పేపర్‌లో ఇలా ప్రకటించింది.

"ఎక్కడున్నా వెంటనే ఇంటికి తిరిగిరండి. మా అమ్మ మనింటికి వచ్చే ప్రయాణం ఆఖరి క్షణంలో వాయిదా వేసుకుంది".

ఓసారి ఓ అల్లుడుగారు వెనకసీట్లో అత్తగార్ని ఎక్కించుకుని కారులో వెళ్తుంటే, దారిలో ఓ పోలీస్ అతన్ని ఆపి, 'మీ కారు వెనక సీట్లోని ఆవిడ పదిమైళ్ళ క్రితం కింద పడిపోయింది" అన్న వార్త చెప్పాడు. వెంటనే అల్లుడుగారు చిరునవ్వుతో "అలాగా? థాంక్ గాడ్. అకస్మాత్తుగా నాకు చెముడొచ్చిందని తెగ ఇదవుతున్నాను" అన్నాట్ట.

ఇలాంటి సందర్భంలోనే ఇంకో అల్లుడుగారు 'నా కారులో నా పెళ్ళయినప్పటినించి ఓ కొత్త స్టీరియో సిస్టం వచ్చింది. మా అత్తగారు వెనక, మా ఆవిడ ముందు' అన్నాడు.

ఓ మిత్రుడి మదర్-ఇన్-లా పోతే పరామర్శకి వచ్చాడు ఒకడు. "పాపం, అత్తగారు పోవటం కష్టమే కదూ?" అన్నాడు అతను.

"కష్టమా? అసలది అసాధ్యం అనుకుని భయపడి చస్తేను?" చెప్పాడా అల్లుడు సంతోషంగా.

బ్రిటన్‌లో అత్తగారు పోవటంతో సంతోషపడ్డవాళ్ళు ఇంకా అనేక మంది. గోల్ఫ్ ఆట ఆడుతున్న ఓ పెద్దమనిషి దూరంగా శవపేటికని గుర్రపు బగ్గిలో తీసుకుపోవడం గమనించి విచారంగా తన తలమీద టోపీని తీసాడు.

"శవాలకి అలాంటి గౌరవం ఇవ్వడం జెంటిల్‌మేన్ లక్షణం" మెచ్చుకున్నాడు అతనితో గోల్ఫ్ ఆడే మరో వ్యక్తి.

"గౌరవమా? పాడా? మా అత్తగారావిడ" అని మళ్ళీ ఆటలో మునిగిపోయాడా మొదటివ్యక్తి.

తన అత్తగారంటే మండిపడే ఓ పెద్దమనిషి తన భార్యతో ఇలా అన్నాడోసారి. "మీ అమ్మ కవలపిల్లల్లో ఒకరు అయినా, ఆ ఇద్దరు కలిసి

కనబడ్డప్పుడు మీ అమ్మని తేలిగ్గా గుర్తుపట్టగలను. ఎలాగో తెలుసా? ఆవిడ కవల సోదరుడికి మీసం వుండదుగా!"

ఇంకోడు తన మదర్–ఇన్–లా గురించి ఇలా వాగాడు. "మా అత్తగారిలో మగాళ్ళు కోరుకునేవన్ని వున్నాయి. పెద్ద పెద్ద కండలు, ఛాతీమీద వెంట్రుకలు, చిన్నగడ్డం."

చాలా తరచుగా బ్రిటన్‌లోని పబ్స్‌లో బీర్ కొట్టాక అత్తగార్ల మీద జోకులు దొర్లుతుంటాయి. ఒకడు బీర్ సిప్ చేసి ఇలా అన్నాడు. "మా అత్తగారు అంత అందవిహీనంగా వుంటుందని నేను అనను కాని మా ఆవిడ చిన్నప్పుడు ఆవిడ దగ్గర పాలు తాగేటప్పుడు కళ్ళకి చేతులు అడ్డు పెట్టుకునేదిట."

బ్రిటన్‌లో విడాకుల సంఖ్య అధికం. ఓసారి కోర్ట్‌లో విడాకులు తీసుకుని బయటకి వస్తూ ఓ వ్యక్తి తనకి అక్కడ తారసపడ్డ మిత్రుడితో ఇలా చెప్పాడు– "నేను ఇంకో స్త్రీవల్ల నా భార్యనించి విడాకులు తీసుకున్నాను.... ఆ ఇంకో స్త్రీ మా అత్తగారు.".

అందుకు ఆ మిత్రుడు సంతోషపడుతూ "కంగ్రాట్స్. నా విషయంలోనూ ఇంతే. ఇంతదాకా మా అత్తగారిని ప్రేమించింది ఒక్కరే. మా మామగారు. ఆయన జంతువుల డాక్టర్" అన్నాడు.

సో, బ్రిటిష్ వాళ్ళ నమ్మకం ఏమిటంటే, మంచి అత్తగారు దొరకడం ఎలా అంటే, పామున్న సంచిలో చెయ్యిపెట్టి చేప కోసం వెదకటం లాంటిది. "ఏడం పేరడైజ్‌లో బ్రతికాడు అని మేం నిజంగా నమ్మడానికి కారణం ఏడంకి అత్తగారు లేకపోవడమే" అని బ్రిటీషర్ నవ్వుతూ చెప్పాడో సందర్భంలో నాకు.

బ్రిటన్‌లోని టెలివిజన్ షోలో ఓ కమేడియన్ తన మదర్–ఇన్–లాని చూపించి చెప్పిన కామెంట్రి - 'టి.వి సెట్‌ని మీరు అడ్జస్ట్ చేయకండి. ఆవిడంతే. మా అత్తగారితో మాంఛెస్టర్ జూకి వెళ్ళినప్పుడల్లా ఆవిడ బర్త్ సర్టిఫికెట్ తీసుకెళ్తుంటాను. అది గేటు దగ్గర చూపించకపోతే ఆవిణ్ణి బయటకి రానీలేదోసారి" ఆ కమేడియన్ చెప్పాడు ఈ జోక్ కూడా. "ఓసారి నా మిత్రుడి అత్తగారు మరణించడంతో నన్ను సలహా

అడిగాడు, ఆవిడని పాతిపెట్టాలా లేక కాల్చాలా అని. 'ఫ్రెండూ. ఎలాంటి అవకాశాలు తీసుకోక. వెంటనే ఆ రెండూ చేయించు' అని సమాధానం ఇచ్చాను.

బ్రిటిష్ దేశంలో ఆడవాళ్ళ ఆధిక్యత ఎక్కువ. తన బంగారు తల్లిని పాడు అల్లుడు ఎంత బాధ పెడుతున్నాడో అన్న భయంతో అత్త గార్లు తరచు కూతురు, అల్లుళ్ళ ఇంటికి వస్తూంటారు. అల్లుడికి 'అల్లుడ రికం' పెడుతూంటారు. అక్కడ మగాళ్ళలో చాలా భాగం భార్యావిధే యులై వుండాలి. లేకపోతే విడాకులు తప్పవు. ఈ రకం సమాజం వాళ్ళది కాబట్టి అత్తగారి జోకులు అక్కడ మంచులా కురుస్తూంటాయి.

లండన్‌లోని ఓ పుస్తకాల షాపుకి ఒకడెళ్ళి 'మదర్-ఇన్-లాని కంట్రోల్ చేయడం ఎలా?' అన్న పుస్తకం అడిగితే ఆ సేల్స్‌మెన్ తక్కున నవ్వి 'మా ఫిక్షన్ సెక్షన్ మేడమీదుంది. అక్కడ ప్రయత్నిం చండి' అన్నాడు. ఇలాగే ఓ బ్రిటీష్ వాడు ఆదివారం వుదయం పైప్ తాగుతూ పేపర్ చదువుకుంటుంటే కొడుకొచ్చి "నాన్నా. మోనోలాగ్ అంటే ఏమిటి?' అని అడిగితే ఆయన పేపర్లోంచి తల ఎత్తకుండానే 'కన్నా, మోనోలాగ్ అంటే అల్లుడు, అత్తగారు మధ్య జరిగే సంభాషణ' అని నిర్వచించాడు.

బ్రిటిషర్స్‌ది పాతిపెట్టే ఆచారం కదా. ఓ అత్తగారు 'నువు చచ్చాక నీ సమాధి మీద డేన్స్ చేస్తాను' అని కోపంగా అల్లుడిమీద అరిస్తే ఆ అల్లుడు చిరునవ్వుతో 'ఆ మాటమీద వుండండి. మరణించాక నన్ను సముద్రగర్భంలో పాతిపెట్టాలని ఎప్పుడో విల్లు రాసాను' అన్నాడు. ఆవిడ అలిగి అల్లుడి ఇంట్లోంచి బయలుదేరింది. ఎయిర్ పోర్టులో ఆవిడ్ని డ్రాప్‌చేసి బయటకి వస్తూంటే అతన్ని చూసిన అతని మిత్రుడు 'ఎక్కడ నుంచి వస్తున్నావు' అనడిగితే 'ప్లెషర ట్రిప్ నించి' అన్నాడు. 'స్విడ్జ ర్లేండా? డిస్నీలేండా?' ఎక్కడికి వెళ్ళావు' అని ఆ ఫ్రెండ్ ఆసక్తిగా అడిగితే 'అలాంటిదేం లేదు. మా అత్తగార్ని విమానం ఎక్కించి ఇంటికి వెళ్ళడం ప్లెషర్ ట్రిప్పేగా" అన్నాడు. ఆ మిత్రుడు కంగ్రాచ్యులేషన్స్ చెప్పి వుంటాడు అతనికీ పెళ్ళయివుంటే.

'ఇట్స్ ఎ మేడ్, మేడ్, మేడ్ వరల్డ్' అనే హాలీవుడ్ చిత్రంలో టిపికల్ బ్రిటిష్ మదర్–ఇన్–లా పాత్ర వుంది. ట్రెషర్ హంట్‌లో తన కూతురు, అల్లుడుతో కార్లో వెనుకసీట్లో కూర్చుని, అల్లుడ్ని తిట్లతో వాయి గొడుతూంటుంది. అలాంటి అత్తగార్ని చూస్తే ఇలాంటి జోక్ ఎవరి కయినా తట్టకమానదు.

ఓ అత్తగారి మరణానంతరం శవపేటికని తీసుకెళ్ళే బండి వెనక క్యూలో వేలకొద్దీ మగాళ్ళు శ్మశానానికి నడుస్తున్నారు. చేతిలో తన ఆల్సేషియన్ కుక్కకి కట్టిన చెయిన్‌తో అల్లుడు నడుస్తున్నాడు.

'ఆ కుక్క కూడా దేనికి?' అడిగాడో దారినపోయే వ్యక్తి.

'ఇది మా అత్తగార్ని చంపేసింది కాబట్టి' చెప్పాడతను.

'మీ కుక్కని ఓసారి మా ఇంటికి తీసుకెళ్ళచ్చా?' అత్తగారితో వేగిపోయిన అతను ఆశగా చూస్తూ అడిగాడు. అందుకా పెద్దమనిషి 'అలాగే. వెళ్ళి క్యూలో నిలబడు' అని సమాధానం చెప్పాడు.

ఇంకో జోక్. ఓసారి ఓ పెద్దమనిషి రైల్వే స్టేషన్‌కి వెళ్ళి తన అత్తగారు కనబడటం లేదని రిపోర్ట్ చేసాడు. ఆ స్టేషన్‌మాస్టర్ 'ఈ విషయంలో నేను మీకేం సహాయం చేయలేను. పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి రిపోర్ట్ చేయండి' అని సలహా ఇస్తే 'వద్దండి. క్రితంసారి ఇలాగే కనపడ నప్పుడు రిపోర్ట్ ఇస్తే వెతికిపట్టుకున్నారు. ఈసారి అలా జరగకూడదని మీకు రిపోర్ట్ చేస్తున్నాను' అన్నాడు.

ఓసారి ఓ పోలీస్ లండన్‌లోని హైడ్‌పార్క్‌లో ఓ బెంచిమీద కూర్చుని ఏడుస్తున్న ఓ మనిషిని చూసి ఎందుకేడుస్తున్నావని అడిగితే అతగాడు 'నేను మా అత్తగార్ని చంపాలనుకున్నాను. వద్దని, అందుకు పధ్నాలుగేళ్ళ కారాగారశిక్ష పడుతుందని నా లాయర్ ఫ్రెండ్ హెచ్చ రించడంతో చంపలేదు. ఆలోచించు. పధ్నాలుగేళ్ళ క్రితం నేనావని చేసి వుంటే ఇవాళ్టికి విడుదలయి స్వతంత్రుణ్ణి అయివుండేవాణ్ణి. ఆవిడ ఇంకా బ్రతికే వుంది. అని మళ్ళీ ఏడవసాగాడు.

ఇలాగే ఓ అల్లుడిగారి ఇల్లు కాలిపోతే ఇన్‌షూరెన్స్ కంపెనీ

ఆఫీసుకి వెళ్ళి జరిగింది చెప్పి, నష్టపరిహారం డబ్బు కోరాడు. అందుకా కంపెనీవారు 'నో. నో. డబ్బివ్వం. కొత్తిల్లు సరిగ్గా అలాంటిదే కట్టిస్తాం' అన్నారు. అతగాడు కొన్ని క్షణాలు ఆలోచించి 'అలా అయితే మా అత్త గారి పేరున తీసుకున్న లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీని దయచేసి కేన్సిల్ చేసేయండి ఎందుకంటే నాకు నా అత్తగారంటే అసహ్యం అన్నాడు'. 'ఎందుకసహ్యం....? మీ అత్తగారు లేకపోతే అసలు నీకు నీ భార్యే వుండేది కాదుగా?' అని కంపెనీవారు అడిగితే 'అది ఇంకో కారణం మా అత్తగార్ని నేను అసహ్యించుకోడానికి' అని నొక్కి వక్కాణించాడు.

ఓ అత్తగారు తన అల్లుడికి ముచ్చటగా పుట్టిన రోజుకి ఓ నీలంరంగు, టై ఎర్రరంగు టై బహూకరించింది. అతగాడు నీలంరంగు టైని ధరించాడు. బ్రేక్‌ఫాస్ట్ దగ్గర అది గమనించి కళ్ళెర్రజేస్తూ అడిగింది ఆవిడ అల్లుడ్ని - "ఏం మిస్టర్? నేనిచ్చిన ఎర్రరంగు టై బావు లేదని చెప్పటమేనా నీ వుద్దేశ్యం?"

అందుకే చాలామంది బ్రిటిష్ అల్లుళ్ళు అంటుంటారు. ప్రతి ఆనందానికి వెనక ఓ ఖర్చు వుంటుందని. ఉదాహరణకి అత్తగారు మర ణిస్తే ఫ్యూన్‌రల్‌కి ఖర్చుపెట్టి తీరాల్సిందేగా అంటూ ఈ వుదాహరణ ఇస్తారు. అలాంటి అల్లుడు ఓసారి ఓ డాక్టర్ దగ్గరికి వెళ్ళి 'మీ అంత గొప్ప డాక్టర్ ఈ లోకంలో లేడు' అన్నాడు. అందుకా డాక్టర్ అతన్ని ఎగాదిగా చూసి 'నీకెప్పుడూ నేను వైద్యం చేసిన గుర్తులేదే?' అంటే 'నాక్కాదు. మా అత్తగారికి' అన్నాట్ట.

ఆ అల్లుడు వెనక్కి తిరిగి బయటకి వస్తూ లోపలికి వస్తున్న ఓ పాత మిత్రుడ్ని చూసి 'అరె! మీ అత్తగారికింకా నీ మీద కోపం తగ్గలేదా?' అనడిగాడు.

"లేదు కాని ఆ సంగతి నీకెలా తెలుసు?" అంటే 'నీ వీపులో దిగిన కత్తిని చూసి అనుకున్నానులే' అన్నాడు.

అంచేత తెలుగు అల్లుళ్ళు ఈ వ్యాసం చదివాక బ్రిటన్‌లో పుట్టనందుకు సంతోషించి తీరాలి.